

చందు సుబ్బారావు
మనవాడే!

మా బంధుకోటిలో ఎవరి పెళ్ళికన్నా వెళ్ళితే చాలు. పెళ్ళి పందిరంతా 'మన' వాళ్ళతో ఒకటే ఘాటు వాసన అగరొత్తులకంటే అధికంగా ముక్కులు బద్దలు కొడుతుంటుంది. బెజవాడ వీరవిక్రమ కాలేజీ ప్రిన్సిపాల్ మనవాడే! సీలేరు ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరు గారు మనవాడే! హైదరాబాదు పోలీసు కమీషనర్‌గారు కూడా మనవారే

పందిట్లో మనవారుకాని మిత్రులెవరయినా వుంటారని కూడా గమనించకుండా మన తనం మ్రోగిపోతుంటుంది. నాకయితే చాలా సార్లు విసుగూ, అసహ్యమూ కలిగేవి.

నేను ఏ 'మన'తనానికి చెందినవాణ్నో స్పృహ కూడా లేనంత గొప్పవాణ్నని స్వయాన ప్రకటించుకోలేను కాని నా మట్టుకు నాకు 'మన' తనంమీద ఎప్పుడూ మక్కువ కలగలేదు.

అందమయిన అమ్మాయీ, ఆప్తుడయిన అబ్బాయీ నాకు మనవాళ్ళే అవ్వాలని అని పించలేదు. నేను మెచ్చిన రచయితా, నాకు నచ్చిన ఆర్టిస్టూ పరాయివాళ్ళే అయ్యారు. ఆపదలో రక్షించినవాడూ, ఆదరంగా ఉద్యోగ మిచ్చినవారూ నాకు చెందిన 'మన'వాళ్ళు కానే కాదు.

కారణాంతరాలు అంటూ వేరే లేవుకాని మా ఆవిడ మాత్రం మనవాళ్ళకే చెందటం కేవలం యాదృచ్ఛికం కాదు. 'మన'తనం నుంచి 'మగ'తనం కూడా బయటపడలేని మొట్టమొదటి 'రాజీ' అనబడే స్వార్థానికి చెందిన విషయమే అనుకుంటాను. అందుచేత ఎక్కువగా 'మన'తనాన్ని గర్హిస్తూ ఉపన్యాసా లివ్వటానికి జంకుతుంటాను. పైగా మా అవిడ ట్రాన్స్‌ఫర్ విషయంలో ఇంకా లోతుగా ఇరుక్కుపోయాననే చెప్పాలి. ఇంట్లో మూల పారేసుండే మడ్డి కత్తికి పదునొచ్చింది. చుట్టాలొచ్చారని కోడిని కోసుకోటానికి మడ్డి కత్తి మళ్ళీ బయటకొచ్చింది.

*　　　*　　　*

మా ఆవిడ సదరు కమలకుమారి విజయ వాడ ప్రభుత్వ కళాశాలలో పని చేస్తుండేది. నేను వాల్తేరు యూనివర్శిటీలో వుంటూ నెలకో సారి బెజవాడ పోయొస్తుండేవాడ్ని. గోదావరి ఎక్స్‌ప్రెస్ పడింతర్వాత రెండు గంటల ప్రయాణకాలం తగ్గినమాట వాస్తవమేకాని నాగరికత పెరిగిన కొద్దీ మనసు కూడా వేగం పుంజుకుంటుందేమో బెజవాడ నెలకు రెండు సార్లు ప్రయాణమవుతుండేవాడ్ని. రైల్వే డిపార్టుమెంటువారి వార్షిక బడ్జెట్‌లో నష్టాన్ని చాలావరకు నేనొక్కణ్నే పూడుస్తున్నానేమో అనిపించేది.

ఎంత మనసు నిగ్రహించుకుని కూచుందా మనుకున్నా శలవు దొరికేసరికి పిల్లవాడికి బాగా లేదనో, పిల్లదానికి పుట్టినరోజనో కారణం కల్పించుకుని అంతరాత్మను సముదాయించుకుని ఆదరా బాదరా బెజవాడ చేరేవాణ్ణి. పెళ్ళయిన ఆరేడు ఏళ్ళనుంచీ ఇలా మాస శివరాత్రులు గడపటం ఆత్మవంచన, పరవంచన, పత్నివంచన అని తెలుసుకోటానికి అట్టే కాలం పట్టలేదు. పరుగెత్తుకుపోయి పిల్లల్నికూడా చూడకుండా అర్ధాంగితో ఏకాంతం కోరుకోవటం భౌతిక శాస్త్రీయమేమోకాని, జీవనశాస్త్రీయంగా కన్పించ లేదు.

'విశాఖపట్నం మార్పించటానికి ప్రయత్నిం చండీ' అని మా ఆవిడ ఎన్ని సార్లందో దాదాపు అన్ని వందల రూపాయలు ఖర్చు పెట్టాను హైదరాబాదు పోవటానికీ, రావటాని కీను

హైదరాబాదు ఆఫీసువారు కరుణించనే లేదు

మాకు పిల్లలు పుట్టారు. మా ఆవిడకు విసుగూ పుట్టింది.

నాకైతే బెజవాడకు 'గోదావరి వేసారుకదా, ఎక్కడుంటే ఏంలే' అనిపించింది. అంతగైనా కోనార్క్ ఎక్స్‌ప్రెస్, కోరమాండల్ ఎక్స్ ప్రెస్ వేసాం నాయనా వెధవది ట్రాన్స్‌ఫర్ అయితే ఎంత, కాకపోతే ఎంత అని రైల్వే వారు నా అత్త మామల్లా సముదాయించారు.

నా స్నేహితుడు బ్రహ్మం అయితే 'అయితే యాభై రూపాయలు పెట్టుకుని బెజవాడ

పోవాలేమిటోయ్, అయిదు రూపాయలు పట్టుకొని గాజువాక బస్సెక్కు. పాత పోస్టాఫీసు దగ్గర దిగితే రోజుకో వెరైటీ కూడాను ' అంటున్నాడు...

'నాన్నా, నాన్నా మమ్మల్నికూడా విశాఖపట్నం తీసుకుపో' అంటున్నారు పిల్లలు పాపం ఊటీనో, సిమ్లానో అడగటం లేదు వాళ్ళు! నాన్న దగ్గరకొస్తా మంటున్నారంతే!

"మీ యిద్దరూ ఒక చోటుంటే చూడాలనుందిరా నాయనా" అంటూ అదేదో కాశీ విశ్వేశ్వరుణ్ణి చూసినంత పుణ్యకార్యంలా మరీ మరీ కోరుకుంటున్నారు వృద్ధులైన తల్లిదండ్రులు.

బ్రహ్మాం కాక మిగతా మిత్రులు కూడా "ఈ మరం నిద్ర, సత్రం భోజనం ఎన్నాళ్ళోయ్, ఉద్యోగం మానేసి మీ ఆవిణ్ణి రమ్మను " అంటున్నారు పరిష్కారం బాగుంది కాని, అందులో ఉప్పూ, కారం తక్కువయినట్లుందేది. ఉద్యోగం మానేస్తే పరిష్కార మేమిటి—పిండాకూడు. **'For a few Coins'** నానా గడ్డీ కరుస్తున్నారు ప్రజలు పెళ్ళాం ఓ వెయ్యి రూపాయలు సంపాదిస్తే వుండే సుఖవూ, సౌకర్యమూ యింట్లో కూచుని, ప్రక్కింటావిడ చీరలమీద ప్రతిరోజూ మనకు వుపన్యాసమిస్తుందంటే ఉంటుందా ! సంసారం కాదు సన్యాసం పుచ్చుకోవాలనిపించదూ

ఏమైనా, సకల చరాచర భౌతిక శక్తులూ, పంచభూతాలూ కూడా మా ఆవిడ విశాఖపట్నం ట్రాన్స్‌ఫర్ కావటాన్ని కోరుకున్నాయి కాని జరిపించలేదు.

ఇహ ఒంటరి గదినీ, ఏకాంతాన్నీ, ఏదో పుస్తకాలనీ నమ్ముకుని సిగరెట్లతోనూ సినిమాలతోనూ కాపురం చెయ్యక తప్పదని తీర్మానించుకుని పోస్టల్ డిపార్ట్‌మెంటును పని రోజుల్లోనూ సౌత్ సెంట్రల్ రైల్వేవారిని శలవరోజుల్లోనూ ఆశ్రయిస్తూ బ్రతుకుతుండగా

* * *

ఒకానొక మనవాడిపెళ్ళిలో మా తోడల్లుడు శ్రీ శివరామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్, **PWD**, గుంటూరుగారు మళ్ళీ ఈ విషయం కదలేసారు.

"ఓస్ ఇంతేనా, చెప్పావుకావేమీ మూణ్ణెమిషాల్లో పని పోనీ నాతో చెప్పకపోయినా కమలకుమారి వాళ్ళక్కతో చెప్పొచ్చుగా ఈపాటికి వాల్తేరులో ఇద్దరూ మరొక పిల్లను కూడా కనకపోయారా " అని జోకుతో సహా అభయం ప్రసాదించాడు.

"అబ్బే ఫామిలీ ప్లానింగ్ అయ్యిందండీ" అందామనుకున్నా కాని "అం, వేధవది తెలియకనా " అని వూరుకున్నాను

"ఇంకేం వచ్చే నెల మూడో తారీఖున బయలేరి గోదావరిలో రా నేను బెజవాడలో మీటవుతాను హైద్రాబాద్ పోదాం " అన్నాడు.

'పని అయిపోయినంత' ధీమాగా పలికాడు శివరామకృష్ణ. ఆయన ప్రతిభా వ్యుత్పత్తుల మీద ఇదివరలో చాలా కితాబులున్నాయి కాని, ఆయనది ఇంజనీరింగ్ ఫీల్డు మాది విద్యారంగం అవుతుందో లేదో అని వెరచాను. సరే ఆఖరి ప్రయత్నం క్రింద చేద్దామని సంకల్పించి "అలాగే అన్నయ్యగారూ " అన్నాను.

* * *

ఆ చెప్పిన మూడో తేదీకి ఇద్దరం హైద్రాబాద్ చేరాం "హోటల్లో దిగుదామండీ" అన్నా


శివరామకృష్ణ "ఎందుకూ మన మేనమామ అత్తగారి వియ్యంకుడి కొడుకు కిక్కడే హార్డ్‌వేర్ షాప్ పెట్టాడు పద" అని అతనింటికి తీసుకుపోయాడు.

అతనింట్లో బస చేసి, కాస్సేపయ్యాక ముగ్గురం పధకం ప్రకారం బయలుదేరాం

ముందు అసెంబ్లీకి పోయాం అక్కడ మన ఎమ్మెల్యే ఒకాయన్ని కలుసుకుని సంగతంతా వివరించాం (శివరామకృష్ణ వివరిం

జీడిపప్పు జన్మస్థలం బ్రెజిల్. అక్కడి "టుపీ" జాతివారు దీన్ని "అకాజూ" అని పిలిచేవారు. పోర్చుగీసు నావికులు మన దేశానికి వలస వచ్చినప్పుడు దీన్ని పట్టుకొచ్చారు. కేరళలోని కొచ్చిన్ వాసులు దీన్ని "పరంగి మాంగా'' అంటారు. "పరంగి" అంటే పోర్చుగీసు వారు, "మాంగా" అంటే మామిడికాయ అని అర్థం. పోర్చుగీసువాళ్లు జీడి మామిడి కాయనుండి "కాష్యూ వైన్'' తయారుచేశారు. "కాజూఫెనీ" అనబడే యీ "వైన్" ఇప్పటికీ గోవా బార్లలో దొరుకుతుంది॥

(వి)చిత్ర విజ్ఞానం



చాడు) ఆయన వెంటనే ఫోను పుచ్చుకుని ఉన్నత విద్యాశాఖ కార్యాలయంలో మూడవ సహాయ కార్యదర్శి అయిన ఐఏఎస్ ఆఫీసరు గారికి ఫోను చేసాడు.

ఆఫీసరుగారు "అర్జంటు పనిమీద మంత్రి గారితో వెళ్ళిపోతున్నాననీ ఈ పని ఎవర్ని కలుసుకుంటే చెప్పిన క్షణంలో అవుతుందో" ఆ మళయాళ మాంత్రిక రహస్యం చెప్పి ఫోను పెట్టేసారు. ఐఏఎస్ ఆఫీసర్లు కొంచెం టెక్కుగల ఘనమైనవాళ్ళు. మనవాళ్ళయినా వాళ్ళు కొంచెం తమవాళ్ళుగానే ఉండటం అల వాటు. ఆపాటి సూచనకే పొంగిపోయి, ఫోను పెట్టేసినా నాలుగు Thanks చెప్పి ఎమ్మెల్యే గారు మమ్మల్ని సూటిగా కార్యాలయానికి తీసుకుపోయి ఓ సూపరింటెండెంట్‌గారి కప్ప చెప్పారు. ఇదివరలో నే నాయనచుట్టూ చాలా సార్లు తిరిగాను. ఎన్నిసార్లు తిరిగినా కమల కుమారి అనే పేరు కాని, వాళ్ళాయన అనబడే ఓ జీవి కాని ఆయనకు గుర్తుండే వాళ్ళు కాదు

ఎమ్మెల్యేగారు చెవిలో ఓ మాట ఊది 'వెంటనే' వెళ్ళిపోయారు అసెంబ్లీ సెష న్సున్నాయని ।

ఆ మాట 'ఈటె'లా గుచ్చుకున్నట్లు వెంటనే మా ముగ్గురికీ కాఫీలు తెప్పించా డాయన నే నెవర్నో ఎక్కడుంటున్నానో వాకట్టతీయనారంభించారు.

"ఔరా, దొంగ వెధవా " అనుకుని పైకి మర్యాదగా మాట్లాడాను. "ఓహో మనవాళ్ళింకా ఎవరెవరుంటారండీ యూనివ ర్సిటీలో " అంటూ యోగక్షేమా లడిగాడు. చెప్పాను ఆంధ్రదేశంలో మనతనం యొక్క ఘనతా, చరిత్రా, రాజకీయ సాంఘిక ప్రాము ఖ్యతా శివరామకృష్ణ వివరించాడు. సూప ర్నెంటుగారు చాలా సంతోషించాడు. ఫైళ్ళన్నీ తిరగేయించి, రాయవలసినవి రాసి, కొట్టేయ వలసినవి తీసి 'నోట్' పుటప్ చేశాడు.

"వారం రోజుల్లో వస్తుంది మీ కెందుకు పొండి" అని సెలవిచ్చాడు. నా చెవుల్ని నమ్మ లేకపోయాను— నా కష్టాలు గట్టెక్కాయి. నా సౌఖ్యం యింత కాలానికి పుంజుకుంది నా కోరిక నెరవేరింది

సుఖం సుఖం ఆనందం సంతోషం . సరదా రోజా సంతోషం శివరామ కృష్ణ పుణ్యం సూపర్నెంటుగారి ధర్మం ఆఫీసరుగారి అనురాగం ఎమ్మెల్యేగారి దయ

మా చుట్టంగారి సహాయం ఏమైతేనేం

ఎలాగైతేనేం ఎందుకైతేనేం

నాకు వంటింటి తిండి పడకటింటి నిద్రా

పిల్లల చదువూ చల్లని కొంపా వెనుక

## ఉప్పెన

సముద్రంలోని అలలు
ఉవ్వెత్తున ఎగిరి
అంబరాన్ని చుంబించాలని
కొండను ఢీకొని
విరిగిపోతున్నాయి!
తిరిగి సముద్రంలోనే
కలిసి పోతున్నాయి!!

* * *

సముద్రం అట్టడుగున మనిషి
అలలు వాని కనీనవసరాలు
అంబరం ధరలు
కొండ దళారీ

* * *

మరి సముద్రం పొంగితే ?!

—టి. గౌరీశంకర్.

---

బడే కాసులూ పొద్దుపోయే ఊసులూ . మీ అందరి పుణ్యాన వారందరి ధర్మాన—శివ రామకృష్ణ సంకల్పాన అయ్యింది పనయ్యింది .

"మనవాళ్ళంటే అదీ పనికాకేం చేస్తుంది?" అన్నాడు శివరామకృష్ణ. "అందుకే మనవాళ్ళనో కంట కనిపెట్టుండాలి .." అన్నాడు నవ్వుతూ

నా కేడుపొచ్చింది నా ముఖంలో నెత్తురు పలచబడింది నా గుండెలో నిట్టూర్పు గడ్డ కట్టింది నా బుర్రలో తెలివి తెల్లపోయింది.

నేను పెంచి పోషించుకున్న కుక్కపిల్లలాంటి మేధస్సు చటుక్కుమని త్రెంచుకు పారిపోయింది.

మనవాళ్ళు మనవాళ్ళు మనవాడే .. మనవాడే! నే నెవర్ని? నా స్నేహితులెవరు? నాకు ప్రేమగా ఉత్తరాలు రాసే అహ్మద్, నన్ను నవ్వించి కవ్వించే శాస్త్రి నా ప్రియతమ, స్నేహితుడు వర్మ .నా తమ్ముడు కాని తమ్ముడు దిలీప్ నా ఆత్మీయుడు రవీ, నా స్నేహితురాళ్ళు సరోజా దేవీ, మేరీ జోసఫ్

వీళ్ళంతా ఎవరు ఏమైపోతున్నారు దూరమైపోతున్నారా దూరం చేసుకుంటున్నానా నన్ను నేనే మోసంచేసుకుంటున్నానా!

స్వార్థంలో కరిగి హిమాలయం కృంగిపోతుందా . లౌకిక సమాజం పేరిట కుళ్లు కాలువలుగా ప్రవహించి అఖాతంలో కలిసిపోతున్నా నా

పెద్ద మాటల గూర్చి పట్టింపుకాదు ఎవరో అంటారని భయమూ కాదు నా గుండెమీద చెయ్యి నాకు నిదర్శనం ఆ చెయ్యి వణుకుతూంది ఈ చెయ్యి వణుకుతూంది

* * *

ఆర్డర్సొచ్చాయి. మా ఆవిడ వాల్తేరు వచ్చింది బుట్టలో పాములా ఆలోచన చక్కగా నిద్రపోయింది. ఉదయం ఆరయ్యేసరికి చిక్కటి కాఫీ యిచ్చే మా ఆవిడ మొహం, తెల్లవార్లూ నేను చూసిన అందాన్ని మించి ఆహ్లాదంగా కన్పిస్తోంది. పిల్లలు చక్కగా కాన్వెంట్‌కు వెళుతున్నారు. ఒకే జీతంతో సంసారం గడుస్తోంది. కమలకుమారి చీరెలు, నగలు చిన్ని చిన్ని చిద్విలాసాలు మినహాయిస్తే కొద్దిగా డబ్బు 'సేవింగ్స్'లో వేస్తోంది నా ఆరోగ్యం కూడా బాగుంది

మా తోడల్లుణ్ణి తలుచుకుంటూండగా ఆయన దగ్గర్నుండే ఉత్తరం వచ్చింది.

"చిరంజీవి తమ్ముడు రావుకు ..

చి॥సౌ॥ కమలకుమారి ట్రాన్స్‌ఫర్ విషయంలో మనకు సహాయం చేసిన సూపరెంటెండెంట్ గారబ్బాయి యూనివర్సిటీకో సీటుకై వచ్చే నెల మూడవ తేదీన వచ్చుచున్నాడు 'మనవాడే' గనుక తగిన మర్యాదలు చేయటం ధర్మం . పని అగులాగున చూడవలసింది.

మీ అన్నయ్య,
శివరామకృష్ణ." □